

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 70

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.107	187	213
సూర్యాపేట	రూ.95	140	160
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 20.0

పునరావాసంపై.. జాప్యమేల?



నృసింహసాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామం బీఎన్.తిమ్మాపూర్ నిర్వాసితులకు భువనగిరి మండలం హుస్నాబాద్‌లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద అభివృద్ధి చేసిన లేఅవుట్

● నృసింహసాగర్ రిజర్వాయర్‌తో పూర్తిగా మునిగిపోనున్న తండాలు ● ముంపు నిర్వాసితులకు అందని పరిహారం ● మౌలిక వసతుల కల్పనలో విఫలం

పునరావాసం కోసం ముంపు నిర్వాసితులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. 2009లో ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్‌ను 2015లో నాటి సీఎం కేసీఆర్ రీడిజైన్ చేశారు. తర్వాత పనులు కొనసాగుతున్నా నిర్వాసితులను మాత్రం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ప్రాజెక్ట్ కోసం తమ ఇళ్లు, భూములు త్యాగం చేసినా పరిహారం ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని నిర్వాసితులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

నృసింహసాగర్(బస్వాపూర్) రిజర్వాయర్ ముంపు నిర్వాసితుల పునరావాసానికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాగునీటి శాఖ బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో ముంపు నిర్వాసితులకు త్వరలోనే నిధులు మంజూరై పనులు చకచకా సాగుతాయన్న ఆశలో ఉన్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో భువనగిరి మండలంలోని బీఎన్‌తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలంలోని లక్ష్మీనాయకుడి తండా, చొంగల్ నాయకుడి తండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. వీరికి నష్టపరిహారంతోపాటు పునరావాసం కల్పించడంలో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యంలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, రిజర్వాయర్ కట్టపైనే నిరసన దీక్షలు కూడా చేపట్టారు. బీఎన్.తిమ్మాపూర్ నిర్వాసితులకోసం భువనగిరి మండలంలోని హుస్నాబాద్ లోని సర్వే నెం.107లోని 95 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. మొత్తం 118 ఎకరాల్లో లేఅవుట్‌ను రూపొందించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ, కొంత మంది రైతులు భూమి ఇచ్చేందుకు అంగీకరించకపోవడంతో 95 ఎకరాల్లో పనులు చేపట్టారు. 95 ఎకరాల్లో లేఅవుట్‌లో రోడ్లు, ఇళ్లస్థలాలు, పార్కులు, సామాజిక అవసరాలకోసం ప్లాన్ సిద్ధం చేసి అభివృద్ధి చేపట్టారు. గుట్టలుగా ఉన్న భూమిని పూర్తిగా చదును చేసి ఫార్మేషన్ రోడ్లు పూర్తిచేశారు. ప్లాట్లను కూడా లబ్ధిదారులకు పంపిణీచేశారు. అయితే మౌలిక వసతుల కల్పనలో జాప్యం జరిగింది. రోడ్లు, మురుగునీటి కాల్వలు, విద్యుత్ కమ్యూనిటీ హాళ్లు, గ్రామపంచాయతీ భవనంతోపాటు ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు రూ.42కోట్లు అవసరమవుతాయి. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అయితే నిధుల మంజూరులో జాప్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో నిధులు మంజూరై పనులు చకచకా సాగుతాయన్న ఆశాభావంతో ఉన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5.60లక్షలు



నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసంకోసం ప్రభుత్వం రూ.70కోట్లు కేటాయించింది. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు లేఅవుట్‌ను అభివృద్ధి చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, సమగ్ర కుటుంబ సర్వేను పూర్తిచేశారు. ఈ రిజర్వాయర్‌తో గ్రామాల్లో ఇళ్లను కోల్పోతున్న నిర్వాసితులకు 200 గజాల స్థలంతోపాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5.60లక్షల వరకు ప్రభుత్వం ప్యాకేజీకి ప్రకటించింది. బీఎన్‌తిమ్మాపూర్‌లో ఇళ్లు కోల్పోతున్న వారిలో మొత్తం 1,056 మందిని లబ్ధిదారులుగా తేల్చారు. అయితే అధికారులు ఇప్పటివరకు 500 మంది ముంపు నిర్వాసితులకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.5.60లక్షల చొప్పున రూ.28కోట్లు నిధులు విడుదల చేశారు. మరో 556 మందికి రూ.31.13కోట్లు విడుదల చేయాల్సి ఉంది. ఈ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న యాదగిరిగుట్ట మండలంలోని లక్ష్మీనాయకుడి తండా, చొంగల్ నాయకుడి తండా నిర్వాసితులకు దాతర్‌పల్లిలోని సర్వేనెం.297 ప్రభుత్వం గుర్తించి, లేఅవుట్ రూపొందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపింది. అయితే పునరావాస పనులు ఇప్పటివరకు చేపట్టలేదు.

గ్రామాలు ఖాళీ చేస్తేనే రిజర్వాయర్‌లోకి నీరు

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా బస్వాపూర్‌లో నృసింహసాగర్ రిజర్వాయర్ నిర్మిస్తోంది. 16వ ప్యాకేజీ కింద ఆయకట్టు, సాగు, తాగునీటి అవసరాలు, పరిశ్రమలకోసం ఈ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. మొత్తం 11.39 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న రిజర్వాయర్‌ను.. ఏడు టీఎంసీల సామర్థ్యం వరకు పనులు పూర్తిచేశారు. అయితే ఈ రిజర్వాయర్ నిర్మాణంతో బీఎన్.తిమ్మాపూర్, లక్ష్మీనాయకుడితండా, చొంగల్ నాయకుడితండా పూర్తిగా మునిగిపోతున్నాయి. రిజర్వాయర్‌లోకి నీరు మళ్లించిన పక్షంలో ఈ గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. ఈ గ్రామాలను ఖాళీచేస్తే తప్ప రిజర్వాయర్‌లోకి నీటిని వదలలేని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నప్పటికీ, ముంపు గ్రామాలకు పునరావాస కల్పనలో జాప్యం జరుగుతోంది. ఈ ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇళ్లస్థలాల కేటాయింపు, నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేసింది. ఈ నేపథ్యంలో ఈ రిజర్వాయర్‌లోకి ఇప్పటివరకు నీరు మళ్లించడంలేదు. పునరావాసంతోపాటు భూసేకరణ నిధులు మంజూరుచేస్తే ఊరు ఖాళీ చేసే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

నృసింహసాగర్ రిజర్వాయర్‌తో ముంపునకు గురవుతోన్న నిర్వాసితులకోసం భువనగిరి మండలంలోని హుస్నాబాద్ లోని 95 ఎకరాల ప్రభుత్వభూమిని గుర్తించారు. మొత్తం 95ఎకరాల్లో లేఅవుట్‌ను రూపొందించాం. లేఅవుట్ పనులు పూర్తిగా మౌలిక వసతులైన రోడ్లు, మురుగుకాల్వలు, ప్రభుత్వ భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం రూ.42కోట్ల మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

గిరిధర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈఈ

పంచాయతీల్లో ప్రత్యేక పాలనే!

» పెద్ద పంచాయతీలకు తహసీల్దార్లు, ఎంపీడీవోలు » సిద్ధమైన ప్రత్యేక అధికారుల జాబితా



నల్లగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పంచాయతీల పాలకవర్గాల గడువు మరో ఐదు రోజుల్లో ముగియనుంది. పార్లమెంటు ఎన్నికల తరువాతే పంచాయతీ ఎన్నికలు అనే సంకేతాలు నేతలు, అధికారులు ఇప్పటికే ఇచ్చారు. దీంతో పంచాయతీల్లో పాలన సాగేందుకు నేతల స్థానంలో అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకు అధికారుల జాబితాలను జిల్లా పంచాయతీ అధికారులు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,740 పంచాయతీలు ఉండగా, పెద్ద సంఖ్యలో ప్రత్యేక అధికారుల అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ ఈ శాఖ అనే తేడా లేకుండా అన్ని ప్రభుత్వశాఖల నుంచి అధికారులు ఇప్పటికే వివరాలు సేకరించారు. తహసీల్దార్ మొదలు టైపిస్ట్ వరకు పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈమేరకు మూడు జిల్లాల్లో పంచాయతీ అధికారులు ఆయా గ్రామాల అధికారుల జాబితాలను సిద్ధం చేసి పెట్టారు. పంచాయతీల పదవీకాలం ముగిసినా, వాటిని తమ చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. వారికి అనుకూలమైన వ్యక్తులను తమకు కావాల్సిన గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా వచ్చేలా జాబితాలు సిద్ధం చేయించినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

వచ్చేనెల 1న ముగియనున్న గడువు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1,740 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844, సూర్యాపేట జిల్లాలో 475, యాదాద్రి జిల్లాలో 421 పంచాయతీలు ఉన్నాయి. ఆయా జిల్లాలో 2019 జనవరి 24, 27, 30 తేదీల్లో రెవెన్యూ డివిజన్ల వారీగా సర్పంచుల ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో ఎన్నికైన పాలక వర్గాలు ఫిబ్రవరి 2వ తేదీన బాధ్యతలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో పాలక వర్గాల గడువు ముగుస్తుండటంతో ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నెలన్నర ముందే సిద్ధమైంది తప్ప నోటిఫికేషన్ జారీ చేయలేదు. కేవలం ఆరు రోజులే ప్రస్తుత పంచాయతీల పాలక వర్గాలకు గడువు ఉండటంతో ప్రభుత్వం పాత సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగిస్తుందా? లేదంటే అధికారులకు బాధ్యతలు ఇచ్చి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుందా? అనేది ఈ వారంలో స్పష్టత రానుంది. గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ఈ నెల 31వ తేదీన ముగుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఈనెల 30 లేదా 31 తేదీల్లో కలెక్టర్లు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. అయితే సర్పంచులు తమ పదవీ కాలాన్ని మరో ఆరునెలల పాటు పొడిగించాలని, గతంలో చేసిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించే బదులు అధికారులకే బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉంది.

రిజర్వేషన్లపై నేతల్లో ఆందోళన

గ్రామ పంచాయతీల్లో రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్లు ఉండేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 2019లో జరిగిన ఎన్నికల ప్రకారం అప్పటి రిజర్వేషన్ ఈ ఏడాది జరిగే పంచాయతీ ఎన్నికల్లో కూడా కొనసాగించాల్సి ఉంటుంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత రిజర్వేషన్లను కొనసాగించే అవకాశాలు దాదాపు ఉండవని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అప్పటి రిజర్వేషన్లు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఆ పార్టీ అవకాశాలను గండి కొట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అసెంబ్లీలో రిజర్వేషన్లపై చట్టం తీసుకురానున్నట్టు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న చోటామోటా నాయకులు రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆందోళనలో పడ్డారు. ఇప్పటి నుంచే గ్రామాల్లో తమ బలాన్ని చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నా, రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుండటంతో ఇప్పటి నుంచే ఖర్చు పెట్టేందుకు వారు వెనుకడుగు వేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు ఎలా ఉన్నాయనే దానిపై పంచాయతీ అధికారుల నుంచి నివేదిక తీసుకుంది.

వస్త్ర దుకాణాల తనిఖీలపై రగడ

● విజిలెన్స్ అధికారుల తనిఖీలపై నిరసనగా ధర్నా
● భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన పోచంపల్లి చేనేత నాయకులు



పోచంపల్లిలో వస్త్ర దుకాణాల తనిఖీలను నిరసిస్తూ ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 25: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల ఉత్పత్తి కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులను ఖండిస్తూ చేనేత కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 23న రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.వెంకటేశం ఆధ్వర్యంలో ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో ఈ ఆందోళనకు దిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ డిజైన్లకు, వస్త్రాలకు పేటెంట్ హక్కులున్నాయన్నారు. ఈ హక్కులను పరిరక్షించాలని, పోచంపల్లి డిజైన్లను పవర్‌లూమ్‌లపై ప్రింటింగ్ చేస్తున్నారని, ప్రింటింగ్ చీరలను నివారించాలని ఇటీవల భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు విన్నవించుకున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.వెంకటేశంతోపాటు 15మంది విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు చేశారన్నారు. పోచంపల్లి దుకాణాల్లో తనిఖీచేసి ఇక్కత్ చీరలను నకిలీ అని తేల్చారని, ఇది సరికాదన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ధర్నా

అధికారుల దాడులను నిరసిస్తూ పట్టణంలోని వస్త్ర దుకాణాలను మూసివేసి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేష్, ప్రధాన కార్యదర్శి భారత లవకుమార్, ప్రతినిధులు సీత లక్ష్మణ్, ముసుకూరి నర్సింహ, ఈపూరి ముత్యాలు తదితరులు మాట్లాడుతూ భూదాన్‌పోచంపల్లిలో ఎక్కడా నకిలీ చీరలు లేవని, విజిలెన్స్ అధికారులు చూపించిన చీరలు హ్యాండ్లూమ్‌లోనే నేసినవేనన్నారు. అధికారులు అవగాహన లేకుండా తమకు నోటీసులు జారీ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోచంపల్లికి ప్రపంచవ్యాప్తంగా మంచి ఖ్యాతి ఉందని, అధికారుల తనిఖీలతో ఆ ఖ్యాతి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అవగాహనా రాహిత్యంతో స్టేట్‌మెంట్ ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ప్రింటెడ్ చీరలు హైదరాబాద్‌లోని మదీనాలాంటి సెంటర్లలో అధికంగా చెలామణి అవుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. అవగాహన లేకుండా అధికారి తమకు నోటీసులు జారీ చేశారని ఆరోపిస్తూ చేనేత నాయకులు గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి ఫిర్యాదుచేశారు. ప్రభుత్వపరంగా సదరు అధికారిపై చర్యలు తీసుకొని, పోచంపల్లి ఇక్కత్ ప్రతిష్ఠను కాపాడాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రాసోలు శ్రీనివాస్, ముస్కూరి నర్సింహ, సూరపల్లి రమేష్, గుండు ఉప్పలయ్య, సంగెం చంద్రయ్య, కర్నాటి బాలరాజు, గంజి యుగేందర్, భారత ఆంజనేయులు, మంగళపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సెస్ బకాయిలు చెల్లించాలి : వీరారెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 25: గ్రంథాలయాలకు రావాల్సిన మునిసిపల్, పంచాయతీల సెస్ బకాయిలను చెల్లించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం 2024-25 సంవత్సరానికి బడ్జెట్ ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని గ్రంథాలయాల పనితీరును సమీక్షిస్తూ పాఠశాల విద్యార్థులను వారానికి ఒక రోజు గ్రంథాలయాలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపాలిటీ, పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలను త్వరగా చెల్లించాలన్నారు. తద్వారా గ్రంథాలయాలకు ఆర్థిక వెసులుబాటు ఉంటుందన్నారు. మునిసిపాలిటీ పరిధిలో పౌర పఠనాలయాలను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్, విద్యాశాఖ అధికారి కే.నారాయణరెడ్డి, డీపీవో ఆర్.సునంద, పౌర సంబంధాల అధికారి పి. వెంకటేశ్వరరావు, కమిషనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

● పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి ● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 25: వచ్చే పార్లమెంట్ ఎన్నికల విధులపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కేంద్రం భువనగిరి అని, ఇందులో భువనగిరి, ఆలేరు, జనగాం, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలతో కలిపి రిటర్నింగ్ ఎన్నికల అధికారిగా యాదాద్రి కలెక్టర్ కొనసాగుతారని చెప్పారు. సెక్టారు అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలు, భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా భారత ఎన్నికల సంఘం సీఈవో రాజీవ్‌కుమార్ సందేశాన్ని స్ర్కీన్‌పై ప్రదర్శించారు. దీంతోపాటు సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సెక్టార్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి ఆర్డీవో పి.అమరేందర్, ఎం.నాగేశ్వరాచారి, తహసీల్దార్లు, సెక్టారు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్యానికి భద్రత

భువనగిరి టౌన్: అర్హత కలిగిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు కలిగిన వారంతా ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. భువనగిరిలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఓటుతోనే ప్రజాస్వామ్యానికి భద్రత ఉంటుందని, ఓటు వేసిన వారికే సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు ఉంటుందన్నారు. ఓటు నమోదు, వినియోగం, ప్రాథమిక కర్తవ్యమన్నారు. 2024లో ప్రపంచంలో 65 దేశాల్లో ఎన్నికలు జరుగుతున్నాయని, అన్ని దేశాలతో పోలిస్తే భారత దేశంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయన్నారు. అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్న దేశం మనదేనన్నారు. అలాగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులు ఫిబ్రవరి 6వ తేదీలోపు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ముందుగా ఓటు అవగాహన ర్యాలీని ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఏ.భాస్కర్‌రావు, జి.వీరారెడ్డి, డీఈవో డాక్టర్ కె.నారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఏవో మందడి ఉపేందర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి, జిల్లా అంబాసిడర్ అన్వితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుకుంటున్న 240 మంది విద్యార్థులకు యువ టీం సమకూర్చిన రూ.1.06లక్షల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డులో ఉమ్మడి జిల్లావాసులు

సభ్యులుగా పాల్వాయి రజని, నర్రి యాదయ్య



పాల్వాయి రజనీకుమారి, నర్రి యాదయ్య

సూర్యాపేట టౌన్ / సంస్థాన్‌నారాయణపురం, జనవరి 25 : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఇరువురికి కీలక పదవులు లభించాయి. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) బోర్డు సభ్యులుగా సూర్యాపేట జిల్లాకు చెందిన పాల్వాయి రజనీకుమారి, యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన నర్రి యాదయ్యను ఎంపికచేస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన రజనీకుమారి హైదరాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. 2004లో టీడీపీ తరపున సూర్యాపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం బీజేపీలో చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా సంస్థాన్‌నారాయణపురం మండలం మల్లారెడ్డిగూడేనికి నర్రి యాదయ్య బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. పదో తరగతి వరకు సర్వేల్‌లో, ఉస్మానియా నుంచి ఇంజనీరింగ్, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎంటెక్ పూర్తి చేశారు.

ఆలేరు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం రేపు

ఆలేరు రూరల్, జనవరి 25: ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్యపై ఈ నెల 27న అవిశ్వాస తీర్మానం పెట్టనున్నారు. ఇప్పటికే చైర్మన్ క్యాంప్ నిర్వహిస్తుండగా.., మరో వర్గానికి చెందిన వారు చైర్మన్‌ను పదవి నుంచి తొలగించే పనిలో భాగంగా వారు కూడా క్యాంప్‌లోనే ఉన్నారు. ఆలేరు మునిసిపాలిటీలో 12మంది కౌన్సిలర్లుండగా, ఎనిమిది మంది కౌన్సిలర్లు ఈ నెల 8న అవిశ్వాస తీర్మానం పెట్టాలని కోరుతూ కలెక్టర్ హనుమంత్ కె.జెండగేకు తీర్మాన పత్రాలను అందజేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు బేతి రాములు, కందుల శ్రీకాంత్, మొరిగాడి మాధవి, మొర్తల సునీత, నాగలక్ష్మి, కాంగ్రెస్‌కు చెందిన చింతలఫని సునీత, బీజేపీనుంచి గెలిచిన సంగు భూపతి, స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచిన గుత్త శమంతారెడ్డి ఉన్నారు. కాగా చైర్మన్ వైపు కేవలం ఎర్ర దయామణి, రాయపురం నర్సింహులు, జూకంటి శ్రీకాంత్‌లు ఉన్నారు. దీంతో చైర్మన్ తన పదవి కోల్పోకుండా తనకు అనుకూల వర్గంతో క్యాంప్‌నకు వెళ్లినట్లు సమాచారం. చైర్మన్‌ను ఎలాగైనా తొలగించి, తమలోనుంచి ఎవరో ఒకరం చైర్మన్ కావాలని కోరుకుంటున్న కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం ఎనిమిదిమందితో క్యాంప్‌నకు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం చైర్మన్ వైపు ఐదుగురు ఉండగా, మరోవర్గం వైపు ఏడుగురు సభ్యులే ఉన్నట్లు సమాచారం. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి నెగ్గాలంటే తొమ్మిది మంది కౌన్సిలర్ల ఆమోదం కావాలి. ప్రస్తుత చైర్మనే తిరిగి చైర్మన్‌గా కొనసాగుతారా...? లేదా కౌన్సిలర్లలో ఎవరో ఒకరు నూతన చైర్మన్‌గా అవుతారా? అన్నది ఈ నెల 27న తేలనుంది.

సర్వం సిద్ధం



75వ గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానాన్ని సిద్ధం చేశారు. జెండా దిమ్మె ఏర్పాటుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు.






కమలాద్రి లక్ష్మీ నరసింహుడి కల్యాణం

నార్కట్‌పల్లి, జనవరి25: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామంలో కమలాద్రి కొండపై కొలువై ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం లక్ష్మీ నరసింహుల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, అర్చకస్వాముల వేద మంత్రోశ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అనువంశీక అర్చకులు కారంపూడి నరసింహాచార్యులు, రాకేశాచార్యులు ఇతర అర్చక బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కల్యాణ ఉత్సవానికి ముందు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.





దేవాలయాల్లో చోరీ చేసిన నిందితుల అరెస్టు

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 25 : తొర్రూరు డివిజన్ పరిధిలోని మరిపెడ, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారు మహబూబాబాద్ జిల్లాలో దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి, అమ్మాపురం సీతారామచంద్రస్వామి, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో దేవుడి విగ్రహాలను ఊరేగింపు సమయంలో చేపట్టే ఉత్సవవిగ్రహాలు, గరుడవాహనం, అశ్వ వాహనం, ఇత్తడి గొడుగు, దివిటీలు దొంగిలించేవారు. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన చింతల పుల్లారావు అనే పాత ఇనుప సామాను కొనుగోలు వ్యక్తికి విక్రయిస్తారు. మరిపెడ మండలంలోని ఎల్లంపేట శివారు జమ్మికుంట తండాలో ట్రాన్స్‌ఫారం, కాపర్ వైరు కూడా దొంగిలించి విక్రయించగా గుండెపుడి ఆలయ ఆవరణలో దొంగతనం చేసినపుడు పోలీసులు విచారణ చేపట్టగా మహిళలు కూడా ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి డివిజన్ పరిధిలోని సీఐల ఆదేశాల మేరకు పోలీసులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. నిందితులు ఉపయోగించిన ఆటో సీసీ కెమెరాలో కనిపించడంతో గురువారం తొర్రూరు ఎస్సై సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ ఆరుగురు చింతల పుల్లారావుతో కలిసి వెళ్తుండడంతో సమాచారం మేరకు పట్టు కుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదు, రెండు క్వింటాల ఇత్తడి విగ్రహాలు, కాపర్‌వైరు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందజేశారు. డివిజన్ పరిధిలోని సీఐలు కరుణాసాగర్, సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, తహేర్‌బాబా, జగదీష్ ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న దేవుడి వాహన విగ్రహాలు

యూటీఎఫ్ సమావేశాలను విజయవంతం చేయాలి

చింతపల్లి, జనవరి 25: నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో ఈనెల 28న నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని కిష్టరాయన్‌పల్లి పాఠశాలలో పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రధాన సమస్యలు చర్చించడంతోపాటు ఇతర ముఖ్యాంశాలు రాష్ట్ర బాధ్యుల సమక్షంలో చర్చించనున్నట్లు తెలిపారు. 28న నిర్వహించనున్న యూటీఎఫ్ విస్తృత సమావేశాలకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.









గణతంత్ర వేడుకలకు పారిశుధ్య కార్మికురాలు


పిడతల నాగలక్ష్మి

కోదాడ రూరల్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం నిర్వహించే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ గ్రామానికి చెందిన పిడతల నాగలక్ష్మి ప్రత్యేక ఆహ్వానితురాలిగా గురువారం వెళ్లారు. నాగలక్ష్మి కోదాడ మున్సిపాలిటీలో మొబైల్ షీ-టాయిలెట్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆమె పనితీరుకు మెచ్చి ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవానికి ఎంపిక చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొమరబండకు చెందిన నాగలక్ష్మి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయినా పట్టుదలతో చదువుకుని బీఏ, బీఈడీ పూర్తిచేసింది. ఉద్యోగాల కోసం అన్వేషణలో ఉండగా, స్థానిక మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా అవకాశం లభించింది. రాష్ట్రం నుంచి మొత్తం 18మంది పారిశుధ్య కార్మికులు ఎంపిక కాగా, అందులో నాగలక్ష్మి ఒకరు. మొబైల్ షీ-టాయిలెట్స్ ద్వారా ఆమె మహిళల సేవలందించారు. గణతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన వెళ్లిన ఆమెను కొమరబండలోని మహిళా సంఘాలు ఘనంగా సన్మానించాయి.

ఇసుక టిప్పర్ సీజ్

కోదాడ రూరల్, జనవరి 25: సూర్యాపే జిల్లా కోదాడ మండలంలోని గుడిబండ గ్రామం వద్ద ఇసుక టిప్పర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా రావిరాల నుంచి కోదాడకు అక్రమంగా వస్తున్న ఇసుక టిప్పర్‌ను గుడిబండ వద్ద పోలీసులు సీజ్ చేశారు. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెడ్‌కానిస్టేబుల్ హెచ్చరించారు.

బేకరీలపై లీగల్ మెట్రాలజీ అధికారుల దాడులు


బేకరిలో నాణ్యతాప్రమాణాలను పరిశీలిస్తున్న అధికారి

నల్లగొండ టౌన్, జనవరి 25: నల్లగొండ జిల్లాకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న బేకరీలపై తూనీకలు కొలతల శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి. రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు బేకరీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బ్రెడ్ ప్యాకెట్లపై తయారీ, అడ్రస్, నెట్ క్వాంటిటీ, తేదీ, కస్టమర్ కేర్ చిరునామా, ఫోన్ నెంబర్, ఇ-మెయిల్ ఐడీ వంటి వివరాలు లేకపోవడాన్ని గుర్తించారు. అదేవిధంగా సాయి కేక్స్ అండ్ బేకరీ, డాల్ఫిన్ బేకరీల్లో కేజీ కేకుకు 150 గ్రాముల తక్కువగా ఉండడాన్ని గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ బేకరీ నిర్వాహకులంతా సరైన తూకం పాటించాలన్నారు. ప్యాకేజీ డెకరేషన్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధికి కారిడార్

● ఔటర్ నుంచి రీజనల్ దాకా అభివృద్ధి లింకు ● పారిశ్రామిక కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు ● అభివృద్ధిపై దృష్టి

చౌటుప్పల్, జనవరి 25: హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను అభివృద్ధి చేసి వాటి రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాజధాని శివారులో ఏర్పాటు చేసిన ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) వరకు అభివృద్ధి కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు దాకా అభివృద్ధి వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసి పారిశ్రామికంగా మరింత అభివృద్ధి పరచడంతో పాటు ఉద్యోగ ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు కసరత్తు ప్రారంభించనున్నారు. ఇందుకోసం శివారు ప్రాంతాలను మూడు క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ ప్రాంతాలను నగరంతో సమానంగా అభివృద్ధి చేసేందుకు కావల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. హైదరాబాద్ నగర జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. దానికి అనుగుణంగా నగరాన్ని విస్తరించాల్సి ఉంది. అందులో భాగంగా శివారు ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి త్వరలో నిర్మించ తలపెట్టిన రీజనల్‌రింగ్ రోడ్డు వరకు మధ్యన ఉన్న ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పారిశ్రామికవాడ, మినీ నగరాలు, రియల్ ఎస్టేట్ వంటి వాటిని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది.

మూడు క్లస్టర్లుగా విభజన

మూడు క్లస్టర్లుగా విభజించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల భాగాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు ప్రాంతాన్ని సెమీ అర్బన్‌క్లస్టర్‌గా, రీజనల్ రింగ్‌రోడ్ అవతల ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్లుగా ఏర్పాటు చేయనుంది. ఏ క్లస్టర్లలో ఏది ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న దానిపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. అర్బన్ క్లస్టర్ ప్రాంతం ఇప్పటికే అభివృద్ధిలో ఉంది. రాజధాని మధ్య ప్రాంతం నుంచి ఈ క్లస్టర్ చివరి వరకు ఇప్పటికే అన్ని రకాల వ్యాపార వాణిజ్య సంస్థలు బహుళ అంతస్తుల భవనాలు, నగర సముదాయాలు ఏర్పాటయ్యాయి. నిర్మాణ రంగం సైతం విస్తరిస్తోంది. రానున్న రోజుల్లో నగరం లోపల అటు ప్రభుత్వ పరంగా ఇటు ప్రైవేట్ పరంగా ఏవైనా భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలనుకున్నా స్థలాలు దొరకని పరిస్థితి ఏర్పడనుంది. ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు మధ్య ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా విభజించనున్నారు. ఈ ప్రాంతం ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణరంగం పనులు సాగుతున్నాయి. నగరంలో స్థిరపడ్డ ప్రజలు కాంక్రీట్ జంగిల్ వాతావరణం నుంచి బయటపడేందుకు యోచిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే చాలామంది పెట్టుబడిదారులు ప్రముఖులు వ్యాపారవేత్తలు ప్రజలు గెస్ట్‌హౌస్, ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. ఇక్కడ బహుళ అంతస్తుల భవనాలు, మినీ నగరాలను ఏర్పాటు చేసే ప్రక్రియను గత ప్రభుత్వం ప్రారంభించినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగర శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఈ ప్రాంతంలో నిర్మాణ రంగాన్ని హార్టికల్ రంగాన్ని మరింత పెంపొందించి ఇక్కడ నగరానికి దీటుగా అన్ని సౌకర్యాలతో మినీ నగరాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ముందుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నిర్మాణరంగంతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వపరంగా ఏ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలనుకున్న సెమీ అర్బన్‌జోన్ ప్రాంతాన్ని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం రాజధాని నగరానికి ఆనుకొని ఉండడం, ఇక్కడ ఏర్పాటు చేతన పెట్టిన ప్రాజెక్టులకు సంబంధించి అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి కలిసి వచ్చే మరో అవకాశంగా కన్పిస్తోంది. రీజనల్ రింగ్‌రోడ్ అవతలి ప్రాంతాన్ని ప్రభుత్వం రూరల్ క్లస్టర్‌గా విభజించన న్నారు. రూరల్ క్లస్టర్ ప్రాంతాన్ని సైతం అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమైంది. ఈ ప్రాంతం ఎలాంటి ప్రాజెక్టులకు అనుకూలంగా ఉంది. ఇక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి కార్యకలాపాలు చేపడితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే దానిపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. అందులో భాగంగానే ఇక్కడి భౌగోళిక పరిస్థితులు ఇక్కడ లభించే మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌కు మరింత ఊపు

నగరశివారు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతాలను మూడు క్లస్టర్లుగా విభజించడంతో రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే అర్బన్ క్లస్టర్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ రంగం ఇటీవలే సెమీ అర్బన్ క్లస్టర్లో సైతం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది.


యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక పైలాన్

ఇప్పటికే ఈ ప్రాంతంలో పదులు, వందల ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలతో భారీ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. దానికి తోడు ప్రభుత్వం కూడా కొంతకాలంగా హెచ్ఎండీఏ ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి ప్రాధాన్యమిస్తోంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మిగులు భూములతో పాటు గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన భూములు నిరుపయోగంగా ఉంటే వాటిలో హెచ్ఎండీఏ ద్వారా వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పనిలో ఉంది. దీనికి సంబంధించి ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల ప్రాంతాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ తదితర ప్రాంతాలలో వెంచర్లకు అనువుగా ఉన్న ప్రభుత్వ భూములను సేకరించేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ సంస్థలు సాగిస్తున్న వ్యాపార కార్యకలాపాలకు తోడు హెచ్ఎండీఏ కూడా ప్రభుత్వ భూముల్లో భారీ వెంచర్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌లో హెచ్ఎండీఏ చేసిన వెంచర్లలోని ప్లాట్లను వేలం వేయగా ప్రభుత్వానికి కొంతకాలంగా కోట్లాది రూపాయల ఆదాయం సమకూరింది. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరం వెలుపల కూడా భారీ వెంచర్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

పారిశ్రామిక రంగం అభివృద్ధికి సన్నాహాలు

సెమీ అర్బన్ క్లస్టర్ ప్రాంతంలో ఇప్పటికే ఒకవైపు మినీ నగరాలు విస్తరిస్తుండగా మరోవైపు పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పారిశ్రామిక రంగం సైతం అడుగుపెడుతోంది. పారిశ్రామిక రంగాన్ని సైతం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. సెమీ అర్బన్ క్లస్టర్ ప్రాంతమైన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ప్రాంతంలో దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటైంది. నగర శివారు ప్రాంతమైన ముచ్చర్లలో ఫార్మాసిటీ సైతం ఏర్పాటైంది. దీంతో పరిశ్రమల స్థాపనకు ఈ ప్రాంతం అనుకూలంగా మారింది. దానికి తోడు ఇప్పటికే నగరంలో ఉన్న పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు అవతల ఏర్పాటు చేసుకోవాలని కొంతకాలంగా ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు సైతం జారీ చేసింది. తమ పరిశ్రమలను అవుటర్ రింగ్‌రోడ్డు అవతలికి తరలించేందుకు పరిశ్రమల యాజమాన్యాలు కొంత గడువు కోరాయి. దీనికి సంబంధించి అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన గడువు సైతం పూర్తయింది. కానీ పరిశ్రమల తరలింపు ప్రక్రియ ప్రారంభం కాలేదు. పరిశ్రమల తరలింపునకు సంబంధించిన అంశాన్ని ఇటీవలే హైకోర్టు సైతం లేవనెత్తింది. తాజాగా నూతన ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో హైదరాబాద్ లోపల ఉన్న పరిశ్రమలు ఇప్పటికైనా శివారు ప్రాంతాలకు తరలి వస్తాయని ప్రభుత్వం భావిస్తుంది. ఇక్కడ మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎలాంటి కాలుష్యపు ముప్పు ఉండ కుండా కాలుష్యరహిత పరిశ్రమలను మాత్రమే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత ప్రజ లకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కోదాడ రూరల్, మిర్యాలగూడ అర్బన్, జనవరి 25 : సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. హైదరాబాద్‌కు చెందిన జంగం కీర్తిసోనిక(23) కారులో తన స్నేహితుడు రాహుల్‌తో కలిసి విజయవాడకు వెళ్తుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం చెక్‌పోస్టు వద్ద చెక్‌పోస్టు వద్ద ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టింది. కీర్తిసోనికకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. రాహుల్ గాయపడడంతో వెంటనే కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు. కీర్తిసోనిక తండ్రి జంగం ఆనంద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం నర్సయ్యగూడేనికి చెందిన నెన్నపంగు మహేష్(22) నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో కూలి పని చేసుకుంటూ తల్లితో కలిసి నివాస ముంటున్నాడు. తల్లితో గొడవపడిన మహేష్ బుధవారం రాత్రి 11గంటలకు ఇంటి నుంచి బయటుదేరాడు. రోడ్డుమార్గంలో నేరేడుచర్లవైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారిపై ఆలగడప టోల్‌గేట్ గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. రోడ్డుపక్కన రక్తపుమడుగులో పడివున్న యువకుడిని గుర్తించిన రాజేష్ అనే వ్యక్తి స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మహేష్ మృతిచెందినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ తెలిపారు.

'వికసిత్ భారత్' బీజేపీ లక్ష్యం


మంచినీటి క్యాన్లు అందజేస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు

నార్కట్‌పల్లి, జనవరి 25: వికసిత్ భారత్ బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ శ్యాంసుందర్ రావు అన్నారు. దేశంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రధాని మోదీ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు లబ్ధి చేసేందుకు కేంద్రం అమలుపరుస్తున్న ఉజ్వల గ్యాస్, ఆయూష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి యోజన, విశ్వకర్మయోజన, పీఎం కిసాన్ నిధి, ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా పీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో గ్రామస్థులకు మంచినీటి క్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూకల శంకర్, బీజేపీ నాయకులు నకిరెకంటి మొగిలయ్య, పోతంశెట్టి రవీందర్, కొరివి శంకర్, పంజాల నాగరాజు, పనస ఉపేందర్, గాలయ్య, సైదులు, జాని తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

● హైదరాబాద్‌లో ప్రియురాలు ఆత్మహత్య.. భువనగిరిలో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం

నాగార్జునసాగర్, నల్లగొండ టౌన్, అడవిదేవులపల్లి, జీడిమెట్ల, జనవరి 25: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులతో మనస్పర్ధలతో నాగార్జునసాగర్ జలాశయంలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక నల్లగొండకు చెందిన స్వర్ణకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు మందలించడంతో అడవిదేవులపల్లిలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై భువనగిరికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇబ్రహీంపట్నం మండలంలోని బొంగులూరుకు చెందిన బండ మల్లేష్(49) ఆటో నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆస్తి పంపకాల్లో కుటుంబసభ్యులతో మనస్పర్ధలు రావడంతో మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి నాగార్జునసాగర్‌కు చేరుకున్నాడు. స్థానిక శివాలయం పుష్కర్‌ఘాట్ వద్ద సాగర్ డ్యామ్ స్పిల్‌వే సమీపంలోని దిగువ కృష్ణానదిలోకి దూకి రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యుత్‌కేంద్రం రివర్సబుల్ పంపింగ్ ద్వారా జలాశయంలోకి నీటిని తోడుతున్నందున మృతదేహం స్పిల్‌వే దిగువ భాగాన 22వ గేటు వద్దకు కొట్టుకువచ్చి నీటిపై తేలియాడుతుండడంతో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విజయపురిసౌత్ ఎస్ఐ వెంకటకొండారెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సిబ్బంది సాయంతో నదిలో ఉన్న మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడు...

శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.దుర్గవ్ బతుకు దెరువు కోసం పది నెలల క్రితం కుటుంబ సమేతంగా నగరానికి వచ్చి జీడిమెట్ల అయోధ్య నగర్‌లో నివాసముంటున్నారు. వీరి కుమార్తె కె.అఖిల(20) సుచిత్రా సమీపంలోని పీఎస్‌కే మార్ట్‌లో ఉద్యోగం చేస్తోంది. అక్కడ మధుగౌడ్ అనే వ్యక్తిని అఖిల ప్రేమించింది. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు యువతిని ఉద్యోగం మాన్పించి రెండు నెలల క్రితం జీడిమెట్లలోని ఓ ప్రైవేట్ కంపెనీలో చేర్పించారు. గురువారం సాయంత్రం ఓ వ్యక్తి పీఎస్‌కే మార్టు నుంచి అఖిల తమ్ముడు సాయికుమార్‌కు ఫోన్ చేసి మీ అక్క ఇంట్లో ఉందో లేదో చూడు అని చెప్పడంతో సాయికుమార్ ఇంటికి వచ్చిచూశాడు. అఖిల ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే పీఎస్‌కే మార్ట్ సిబ్బందికి ఫోన్‌చేసి మాట్లాడగా భువనగిరిలో మధుగౌడ్ కూడా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపినట్లు పోలీసులకు తెలిపారు. జీడిమెట్ల సీఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ విఫలం కావడంతోనే అఖిల మృతిచెందినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో స్వర్ణకారుడు


కృష్ణమోహన్(ఫైల్)

నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతానికి చెందిన నవ్వులూరి కృష్ణమోహన్(41) వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఇటీవల శివాజీ నగర్‌లో ఇంటిని నిర్మించడంతోపాటు అందులోనే బంగారం దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణంతో పాటు షాపు ఏర్పాటుకు అప్పులు కావడంతో కొన్ని రోజులుగా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్య పిల్లలు నిద్రపోయాక ఇంట్లో హాల్లోకి వచ్చి టవల్‌తో కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణమోహన్‌కు భార్య ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కుటుంబసభ్యులు మందలించారని..


ఉపేందర్(ఫైల్)

అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన ఏకుల ఉపేందర్(24) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం మత్తులో ఇంటికి వస్తుండడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉపేందర్ బుధవారం రాత్రి 10గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఉపేందర్ తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు : తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి25: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని అన్ని ట్రేడ్ యూనియన్లకు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో గురువారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ విధానాలను అవలంబిస్తూ రాజకీయ క్రీడ ఆడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వానికి నిర్మాణాత్మక పార్టీగా సహకరిస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, చెరుకు పెద్దులు, సభ్యులు చింతపల్లి బయ్యన్న, నన్నె సాహెబ్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణోత్సవం


నిత్యకలాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో గురువారం వైభవంగా కొనసాగింది. కొండపైన ప్రధానాలయ అష్టభుజి ప్రాకార దక్షిణ దిశ లోని కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం నిర్వహించారు. విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణ తంతు జరిపిన పూజారులు సేవోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ముందుగా ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమ పూజలు నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవామ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,84,008 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

మహాద్భుతమైనది నారసింహావతారం

శ్రీమన్నారాయణుడి దశావతారాల్లో నాలుగోదైన నారసింహావతారం మహాద్భుతమైనదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన భీమవరం రామచంద్ర జీయర్‌స్వామి ప్రవచించారు. జీయర్‌స్వామి తన శిష్యబృందంతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని గురువారం సందర్శించారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన స్వామీజీకి అర్చకబృందం, వేదపండితులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జీయర్‌స్వామి గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రధానాలయ ముఖమండపంలో జీయర్ స్వామీజీ పండిత గోష్ఠి నిర్వహించి భక్తులకు అనుగ్రహభాషణం అందజేశారు. ఆర్తత్రా పరాయణుడిగా నారసింహుడు ప్రసిద్ధి అని, భక్తుడి కోరికను నెరవేర్చేందుకు విశ్వమంతా వ్యాపించాడన్నారు. దశావతారాల్లో రామావతారంలో తానే స్వయంగా పితృ ఆజ్ఞను పాలించాడని, నారసింహావతారంలో పరమ భక్తాగ్రేరుడైన ప్రహ్లాదుడి భక్తిని తండ్రైన హిరణ్యకశ్యపుడు పరీక్షించగా నిర్జీవమైన స్తంభం నుంచి ఉద్భవించి భక్త తత్పరతను చాటాడని తెలిపారు.

అటవీ జంతువులను వేటాడితే చర్యలు

దేవరకొండ, జనవరి 25: అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా కంభాలపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి సాయిప్రకాష్ హెచ్చరించారు. దేవరకొండలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నల్లమల్లలో మనుషులు సంచరించేందుకు అనుమతిలేదన్నారు. అటవీ జంతువులను వేటాడినా, వాటి కోసం విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు పెట్టడడం, విషప్రయోగం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ జంతువులను వేటాడి చంపితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972లోని సెక్షన్ 2(16), 30(ఎ) ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తారన్నారు. నలమల్లలో ఇటీవల వన్యప్రాణుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన తెలిపారు.

చూడచక్కని కోదండరాముడి విగ్రహం

● ఏకండి చెక్కతో తయారు చేసిన గుండ్రాంపల్లి యువకుడు



చిట్యాలరూరల్, జనవరి 25: కోదండరాముడికి చూడ చక్కని విగ్రహం చెక్కాడు నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాపల్లి గ్రామానికి చెందిన యువకుడు మండలోజు వినయ్. అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రతిష్ఠన సందర్భంగా తాను కూడా శ్రీరాముడి విగ్రహాన్ని తయారు చేయాలని సంకల్పించాడు. ఏపూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసే విజయ్ వడ్రంగి వృత్తిని మరచిపోకుండా ఏకండి చెక్కతో 10రోజులు శ్రమించి రోజుకు కొంత భాగం చెక్కుతూ విగ్రహం తయారు చేశాడు. అయోధ్యలో బలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తాను తయారు చేసిన విగ్రహానికి స్థానిక రామాలయంలో ఉంచి పూజలో పాల్గొన్నాడు. రెండు నెలల క్రితం వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని కూడా తయారు చేశానని వినయ్ తెలిపాడు.

తమలపాకులు, జిల్లేడు ఆకులతో ఆంజనేయుని గద



ఆయోధ్యలో రామాలయం ప్రారంభం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో పూజారి పారునంది లక్ష్మణమూర్తి తమలపాకులు, తెల్ల జిల్లేడు ఆకులతో ఆంజనేయస్వామి గద తయారు చేశాడు. ఆకులపై ఆయోధ్య రామాలయం నుంచి వచ్చి అక్షింతలతో 'శ్రీరాం' అని రాశాడు.

● మోత్కూరు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

భువనగిరి టౌన్, జనవరి 25: ట్రాఫిక్, రోడ్డు రవాణా శాఖ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా రవాణా శాఖ అధికారి జి.రవీందర్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం భువన గిరిలో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదని మితిమీరిన వేగంతో వెళ్లరాదని ప్రతీ ఆటో ఫిట్‌నెస్, భీమా కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గణబోయిన వెంకటేశ్, సామల భాస్కర్, సామల శోభన్‌బాబు, జిన్న నర్సింహ, గణేష్, సాయి, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

'వ్యవసాయ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలి'

భువనగిరి టౌన్, జనవరి 25: హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీకి కేటాయించిన 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడారు. భూముల పరిరక్షణకు రూ.16 రోజులుగా విద్యార్థులు చేస్తున్న ఆందోళనను పోలీసులు అమానుష రీతిలో అణచి వేయడం అన్యాయమన్నారు. యూనివర్సిటీని సంప్రదించకుండానే హైకోర్టు నిర్మాణానికి కేటాయించిన భూములను తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలన్నారు. సమావేశంలో లావుడ్య రాజు, వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, వేముల జ్యోతిబసు పాల్గొన్నారు.

జైన దేవాలయ చైర్మన్ సురేంద్రమాన్‌లూనియా కన్నుమూత



సురేంద్రమాన్‌లూనియా(ఫైల్)

ఆలేరు రూరల్, జనవరి 25: మండలంలోని కొలనుపాకలోని శ్వేతాంబర జైన దేవాలయం చైర్మన్ సురేంద్రమాన్ లూనియా గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. జైన దేవాలయ చైర్మన్‌గా ఆలయ అభివృద్ధికి గ్రామాభివృద్ధికి కృషి చేశారని ఆయన మరణం తీరని లోటని ఆ గ్రామ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ గంధమల్ల అశోక్, పలువురు ప్రజా ప్రతినిధులు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

రామన్నపేట, జనవరి 25: మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన మండె యాదయ్య ఇటీవల ప్రమాదశాత్తు మరణించగా అతడికి ప్రమాద బీమా చెక్కు రూ.2లక్షలు మంజూరయ్యాయి. ఈ ప్రమాద బీమా చెక్కును గురువారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, టీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు బత్తుల వెంకన్న, ఉపసర్పంచ్ బత్తిని మహేష్, మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య, నాయకులు కోగూరి వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చౌటుప్పల్ రూరల్ జనవరి 24: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డిని డీఈవో నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సస్పెండ్ చేస్తున్నట్టు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. నారాయణపురం మండలంలో పనిచేస్తున్న నిరంజన్‌రెడ్డి డిప్యూటేషన్‌పై మల్కాపురం పాఠశాలకు బదిలీ అయ్యాడు. అధికారుల అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజర్ అవుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందున నిరంజన్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. నిరంజన్‌రెడ్డి పాఠశాలకు గైర్హాజరు గురించి ఉన్నత అధికారులకు సమాచారం తెలుపనందున ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు చార్జీ మెమో జారీచేసినట్టు ఎంఈవో తెలిపారు.

కోర్టుకు సొంత భవనం నిర్మించాలి

చౌటుప్పల్ టౌన్, జనవరి 25: చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టుకు సొంత భవనం నిర్మించాలని బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తాడూరి పరమేష్ కోరారు. స్థానిక కోర్టులో గురువారం బార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పరమేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనంలో తగినన్ని సౌకర్యాలు లేక పోవడంతో అటు కక్షిదారులు, ఇటు న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. కోర్టు పరిదిలోని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణ పురం, భూదాన్ పోచంపల్లి మండలాల్లో క్రైమ్ రేట్ రోజు రోజుకూ పెరిగిపోతుందని, అందుకనుగుణంగా కేసులను పరిష్కరించేందుకు అద నపు కోర్టుతో పా టు సబ్ కోర్టును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. బాల్యం వెంకటాచలపతి, అసోసియేషన్ ప్రతినిధి జల్లా రమేష్ ఉన్నారు.

భవితకు భరోసా



దివ్యాంగ చిన్నారికి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్ ఫొటో)

● విభిన్న ప్రతిభావంతుల ఎంపికకు సర్వే



దివ్యాంగ బాలుడికి భవిత కేంద్రం అందించిన వీల్‌చైర్(ఫైల్)

భువనగిరి రూరల్, జనవరి 25: చిన్న తనంలోనే పోలియో, శిశు పక్షవాతం, ఎముకల్లో బలహీనత, బహుళ వైకల్యం ఉన్నవారిని విభిన్న ప్రతిభావంత విద్యార్థులుగా గుర్తించి, వీరిని సాధారణ పాఠశాలలో చేర్పించే లక్ష్యంతో సమగ్ర శిక్ష అభియాన్ సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టింది. అందరిలాగే వీరు కూడా సమాన హక్కులు అనుభవించడంతో పాటు విద్యావకాశాలు పొందాలని జాతీయ విద్యా హక్కు చట్టం 2015 నుంచి అమలవుతోంది. లక్ష్యం మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విద్య అందించడంతో పాటు నిధులను కేటాయిస్తున్నాయి. దివ్యాంగులకు 'మన భవిత' కేంద్రాలు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నాయి. ఇలా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఈ విద్యాసంవత్సరంలో చేపట్టిన రెండో విడత సర్వే ఈనెల 31 వరకు కొనసాగనుంది. దీంతో ఆ విద్యార్థులకు అవసరమైన సేవలు అందనున్నాయి.

భవిత కేంద్రాల వివరాలు

జిల్లా పరిధిలో మొత్తం 17 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం 21 భవిత కేంద్రాలు పని చేస్తున్నాయి. అందులో భువనగిరి, ఆలేరు, మోత్కూరు, చౌటుప్పల్, రామన్నపేటలలో మొత్తం 5 శాశ్వత భవనాలు నిర్మించారు. మిగతా 16 కేంద్రాలు ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పలు రకాల సౌకర్యాలు కల్పిస్తూ విద్యనందిస్తున్నారు. మొత్తం 17 మండలాల్లో 3నుంచి 14సంవత్సరాల మధ్య వయసు గల విభిన్న ప్రతిభావంతుల చిన్నారులను గుర్తించేందుకు తాజాగా రెండో విడత సర్వేను చేపట్టారు. అయితే జిల్లాలో దాదాపు 3వేల మంది విభిన్న ప్రతిభావంతుల ఎంపికకు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2703 మంది విద్యార్థులు ఉన్నట్టు సర్వేలో గుర్తించారు. మిగితా 300మంది విద్యార్థులను గుర్తించేందుకు సర్వే ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతుంది.

కల్పించే సదుపాయాలు

మానసిక వైకల్యంతో పాటు వినికిడి లోపం, శారీరక వైకల్యం, జన్యుపరమైన లోపాలతో పుట్టిన వారు, అంధులు వంటి వారి వివరాలను 42 వివరాలతో పట్టికలో పొందుపరుస్తారు. ఇందులో మూడు కేటగిరీలుగా విభజించి ఇంటి వద్ద విద్య, భవిత కేంద్రాల్లో, స్కూళ్ల వద్ద విద్యను అందిస్తారు. సర్వేలో గుర్తించిన పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి శిక్షణ పొందిన ఐఈఆర్పీల ఆధ్వర్యంలో తర్ఫీదు ఇస్తారు. వారిలో మార్పు వచ్చాక సాధారణ పాఠశాల్లో చేర్పిస్తారు. శారీరక నిస్సాహయతతో భవిత కేంద్రాలకు రాలేని పిల్లలు ఉంటే ఐఈఆర్పీలే వారి ఇంటికి వెళ్లి సేవలందిస్తారు. మండల కేంద్రాల్లో వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ చేస్తారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే వారికి రవాణా భత్యం కింద సంవత్సరానికి రూ.5వేలు చెల్లిస్తారు. మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తారు. అవసరమైన వారికి ఉచితంగా సహాయ పరికరాలు అందిస్తారు.



ఆలేరులో భవిత కేంద్రం భవనం

ఈనెల 31 వరకు సర్వే



జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు ప్రక్రియ ఈనెల 31వరకు కొనసాగుతుంది. వారి పూర్తి వివరాలను విద్యాశాఖలోని యూడైస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి పూ ర్తి స్థాయిలో ఐఈఆర్పీలు సేవలందిస్తున్నారు. మౌలిక వసతులు కల్పిస్తూ వారిని భవిత కేంద్రాలకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- కొప్పుల కిరణ్‌కుమార్, ఐఈఆర్పీ, బీబీనగర్

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్ బీకూనాయక్

భువనగిరి రూరల్, జనవరి 25: ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ వైస్‌చైర్మన్ ధనావత్ బీకూ నాయక్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ కార్యాలయ సమావేశపు హాల్‌లో 3వ (వ్యవసాయ) స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో రైతు బంధు డబ్బులు ఖాతాలో జమయ్యే విధంగా, సాగు సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. 2023-24 యాసంగి సీజన్‌లో 98,841 మంది రైతులకు రూ.30.07 కోట్ల రైతు బంధు డబ్బులు వారి ఖాతాలో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ తెలిపారు. మార్కెట్‌లో 781 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లాలో ఎరువుల కొరత లేదని డీఏవో సభ్యులు అడిగే ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం ఎప్పటి నుంచి అమలు పరుస్తారని జడ్పీటీసీ బీరు మల్లయ్య పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించగా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని ఆయన సమాధానమిచ్చారు. అదే విధంగా 6వ (సాంఘీక సంక్షమం) స్థాయి సంఘం సమావేశం యాదగిరిగుట్ట జడ్పీటీసీ తోటకూరి అనురాధ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జడ్పీ సీఈవో చలమల కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ ఎస్ బీరుమల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు గోపి కృష్ణ, సబిత, అన్నపూర్ణ, పద్మజారాణి, రాజారావు, డాక్టర్ వి.కృష్ణ, అనిత, ఈశ్వరయ్య ఉన్నారు.



తుర్కపల్లి : దాత ముందుకొచ్చి కార్యాలయంలో నీటి సదుపాయం కల్పించడం అభినందనీయమని తహసీల్దార్ దేశ్యా అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపీటీసీ నూనావతు ఉమ్లనాయక్ సహకారంతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు.

ఆలేరు రూరల్: కొలనుపాక గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా నోముల వాసు ఎన్నికయ్యారు. గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

ఆలేరు రూరల్: రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలని ఆలేరు తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం కొలనుపాకలోని రైతు సేవా కేంద్రాన్ని ఏవో దీప్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను గోడౌన్‌లో ఉన్న ఎరువులను పరిశీలించారు.

ఆలేరు రూరల్: జిల్లా కేంద్రంలో జరిగే ట్రాక్టర్స్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ పలు రైతు సంఘాల నాయకులు గురువారం ఆలేరులో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక కర్షక వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించి వారి జీవనాలతో ఆటలాడుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, అడవయ్య, ఉప్పలయ్య, జనార్ధన్, వెంకటేష్, కుమార్, అంజిబాబు, సుదర్శన్, తదితరులు ఉన్నారు.

మోత్కూరు : హైద్రాబాదు లలిత కళాతోరణంలో ఫిబ్రవరి 15న సుమారు 3వేల మంది వివిధ కళాకారులతో సకల కళా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్టు మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన నటరాజ్ అకాడమీ వ్యవస్థాపకుడు నల్ల గిరి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనుమరుగై పోతున్న జానపద కళలను కాపాడుకోవడానికి సకల కళల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మేళనానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించామని, వచ్చేందుకు ఆయన కూడా అంగీకరించారన్నారు. చిందు యక్షగానం, కాటిపాపలు, బుడిగె జంగాలు, పెద్దమ్మలోల్లు, బైండ్ల, బుడిబుక్కల, శారదకాల్లు, బుర్రకథ, ఒగ్గు కథ, గగ్గిరెద్దుల ఆటగాళ్లు ఇలా అనేక మంది జానపద కళాకారులు, వారివారి వేషదారణలతో ఈ సమ్మేళనంలో పాల్గొని తమ కళను ప్రదర్శిస్తారన్నారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామంలో లోవోల్టేజి నివారణకు సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య విద్యుత్ సిబ్బందితో అదనపు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గ్రామంలో లోవోల్టేజి సమస్య పరిష్కారమవుతుందన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడి టీచర్ మురారిశెట్టి శ్రీవాణి ఉత్తమ బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) గా ఎన్నికైంది. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో శ్రీవాణికి ఉత్తమ బీఎల్‌వోగా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం, మల్కాపురం వెబ్బర్ చైల్డ్‌హోం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అందించారు. విద్యార్థులకు పాదరక్షలు, స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళ్యం శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం పద్మ, రేణుక, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్‌గా మందడి లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నట్లు సీఈవో దంతూరి నర్సింహ తెలిపారు.

భువనగిరి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పని చేసిన సుమారు 651మంది వీఆర్ఏలను రెగ్యూలైజేషన్ చేసింది. ఈ మేరకు వీఆర్ఏల సంఘం పక్షాన కలెక్టర్ హనుమంతు కే.జెండగేను కలిసి వీఆర్ఏలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

భువనగిరి అర్బన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా వేడుకల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామక్రిష్ణ కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతి పత్రం అందజేశారు. జాతీయ జెండా వద్ద అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటు చేయాలని కోరారు.

'మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ'

మోటకొండూర్, జనవరి 25: బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అస్సాంలో నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రపై బీజేపీ మతోన్మాద శక్తులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి రేగు రమేష్, భువనగిరి ఎల్లయ్య, భూమండ్ల బంగారి, వంగ శివ, బుగ్గ సిద్ధులు, గజరాజు సురేష్, కాంబోజు పరుశురాం, మహేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం: శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చౌటుప్పల్ టౌన్, జనవరి 25: రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేవిధంగా చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ.రామారావు వ్యాఖ్యలు అభ్యంతరకరమని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లల మర్రి శ్రీనివాస్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌కు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై కనీస గౌరవం లేదని, కేసీఆర్‌ను తొందర్లోనే సీఎంను చేద్దామంటూ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చామకూర రాజయ్య, గోశిక రవి, తడక అమర్, వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు.

రామన్నపేట వాసికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ పల్వాన్‌కుమార్

రామన్నపేట, జనవరి 25: రాష్ట్ర స్థాయిలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఫస్ట్ బెస్ట్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ అవార్డును గురువారం హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజా బేగంపేట్‌లో అందుకున్నారు. రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ బాల్తు నాగయ్య చిన్న కుమారుడైన డాక్టర్ పల్వాన్ కుమార్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకోవడం పట్ల సర్పంచ్ గోదాసు శిరీషా పృధ్వీరాజ్, ఎంపీటీసీ ఎండి.రేహాన్, మిత్ర బృందం ఎండి.తఖియొద్దీన్ అమంచ, యాదగిరి, గ్రామ పురం ప్రముఖులు అభినందనలు తెలిపారు.

విలేకరిపై దాడి

వలిగొండ, జనవరి 25: అక్రమ ఇసుక దందాకు అడ్డు వస్తున్నాడనే అనుమానంతో ఒక పత్రిక విలేకరిపై గురువారం కొందరు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన సంగిశెట్టి క్రిష్టఫర్ వృత్తిరీత్యా పాత్రికేయుడు. దుప్పల్లికి చెందిన ఒక మహిళ మండల కేంద్రంలో నివాసం ఉంటోంది. ఆమె తన కుమార్తె వివాహానికి రూ.50వేలు పాత్రికేయుడి వద్ద తీసుకుంది. ఆ డబ్బులు తిరిగి ఇస్తానని ఫోన్ చేసి చెప్పగా అతను ఆమె వద్దకు వెళ్లాడు. అకస్మాత్తుగా కొందరు వచ్చి అతనిపై దాడి చేసి గాయపర్చారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సదరు పాత్రికేయుడు తమ కాలనీ వాసులపై అమర్యాదగా ప్రవర్తించాడని కాలనీ వాసి ఈదయ్య అనే వ్యక్తి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది



ఆలేరులో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆలేరు రూరల్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని పలువురు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆలేరులో ఎన్‌సీసీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శ్యామసుందరీ, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ ప్రణయ్‌కుమార్, ఆర్ఐలు సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరాచారి, కిష్టు, ఉపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి, శేఖర్, ఖాజాఅలీ ఉన్నారు.

భువనగిరి టౌన్: బీజేవైఎం ఆధ్వర్యంలో భువనగిరిలోని నవభారత్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువ ఓటర్ల సమ్మేళనం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీజేవైఎం జోనల్ ఇన్‌చార్జి పట్నం కపిల్, కళాశాల ప్రిన్సిపాల్ చిక్క ప్రభాకర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పి.ఉమాశంకర్‌రావు, నాయకులు పి.జగన్మోహన్‌రెడ్డి, కానుకుంట్ల రమేష్, బూరుగు మణికంఠ గౌడ్, ఆకుతోట రామకృష్ణ పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని నీర్నెముల గ్రామంలో సామాజిక కార్యకర్త నోముల యాదగిరి గ్రామ మహిళలు, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చలమల్ల గోవర్ధన్, కన్నబోయిన పద్మ, చలమల్ల ధనంజయ్య, రవి, పద్మ, మల్లమ్మ, పూజిత, భవాని, యాదమ్మ, హేమలత, యాదమ్మ, రాధిక, శివ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : ప్రధాని మోదీ ప్రసంగాన్ని చౌటుప్పల్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై పలువురు తిలకించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వీవీ శ్యామ్ సుందర్ రావు, మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. శ్రీధర్ బాబు, బీజేవైఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మునగాల రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, తరుణ్‌రెడ్డి, ఊడుగు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం అరవిందరాయుడు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సఫియొద్దీన్ సీనియర్ అసిస్టెంట్ పాండ్, ఆర్ఐ మల్లిఖార్జునరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలిగొండ: మడంల కేంద్రంలో ప్రగతి డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఏలె చంద్రశేఖర్, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి గండికోట హరికృష్ణ, బీజేపీ మండల అధ్యక్షులు నాగవెల్లి సుధాకర్‌గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రేగూరి అమరేందర్, కనతాల అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, మత్స్యగిరి, నర్సింహ, మహేశ్, నాగరాజు, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని మర్యాల గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి ఆధ్వర్యంలో గ్రామంలో ఓటరు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసాచార్యులు, మూబిన్, శ్రీకాంత్, విజయలక్ష్మీ, బాలసుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గం సాయివర్ధన్, వి.జ్యోతి పాల్గొన్నారు. జలాల్‌పూర్‌లో స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో ప్రతిజ్ఞ చేయించారు.

మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల విద్యార్థులకు అవార్డులు

మోటకొండూర్ : ఎస్‌వీఈఈపీ శాసనసభ ఎన్నికల సందర్భంగా సెప్టెంబర్‌లో నిర్వహించిన యంగ్ ఓటర్స్ అనే కార్యక్రమంపై నాటిక రూపంలో అవగహన కల్పించిన మండల కేంద్రానికి చెందిన మహాత్మా జోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి పొందారు. గురువారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవం కర్యక్రమం సందర్భంగా వీరికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై అవార్డుతో పాటు, ప్రశాంస ప్రత్రాన్ని అందజేశారు. అవార్డులు పొందిన వారిలో ఝాన్సీ, అఖిల, సౌమ్య, పూజ, స్పందన, శృతి, రుత్విక, మహాలక్ష్మి, నవ్యశ్రీ, కావేరి ఉన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రిన్సిపాల్ జ్యోతి, పద్మావతి, పీఈటీ నవనీత అభినందించారు.



గవర్నర్ తమిళిసై నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు